సాక్షి
జోగుళాంబ గద్వాల
మంగళవారం : 15 : జూలై : 2025



శిక్షణకు వేదిక

పాలమూరులో వాలీబాల్ అకాడమీని మెరుగైన శిక్షణకు వేదికగా తీర్చిదిద్దారు.

వివరాలు 8లో ▶



జూరాల గేట్ల మూసివేత

ఎగువ నుంచి వరద తగ్గడంతో సోమవారం జూరాల క్రస్ట్ గేట్లు మూసివేశారు.

వివరాలు 8లో ▶

గరిష్ఠం/కనిష్ఠం
37.4 /23.1

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు ఉద్యోగ మేళా

గద్వాల: జిల్లాలోని నిరుద్యోగ యువతకు పలు ప్రైవేటు **కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు** కల్పించేందుకు **ఈ నెల 16న ఐడీఓసీలోని** జిల్లా **ఉపాధి కల్పనాధికారిణి ప్రియాంక** సోమవారం **ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా** కేంద్రంతో **పాటు అయిజ, కర్నూలు, మహ** బూబ్‌నగర్ **ప్రాంతాల్లోని కంపెనీల్లో శిక్షణ** అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 18–35 ఏళ్ల వయసు ఉండి, ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ ఏదైనా డిగ్రీ, ఎంబీఏ విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. ఐడీఓసీలోని ఉపాధి కల్పనశాఖ కార్యాలయంలో నిర్వహించే ఉద్యోగ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల: జిల్లాలోని దివ్యాంగులకు ఆర్థిక పునరావాస పథకం ద్వారా 2025–26 సంవత్సరం అందించే సబ్సిడీ రుణాల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీడబ్ల్యూ ఓ సునంద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి, చేతివృత్తుల, కుటీర పరిశ్రమల ఏర్పాటు చేసుకునేందుకు గాను మండలానికి ,మున్సిపాలిటీకి ఒకటి చొప్పున రూ. 50వేల నాన్ బ్యాంక్ లింకేజీతో, జిల్లాకు ఒక లింకేజీ యూనిట్ కోసం ఈ నెల 31వ తేదీలోగా https.tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సర్టిఫికెట్ల పరిశీలన..

జిల్లాలో దివ్యాంగుల ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సదరం సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని డీడబ్ల్యూఓ తెలిపారు. ఐడీఓసీ భవనంలో ఈ నెల 15, 16 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ అప్లికేషన్ ఫాంతో పాటు సదరం ఒరిజినల్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, కులం, ఆదాయం ధ్రువపత్రం ఒక సెట్ జిరాక్స్‌తో హాజరు కావాలని సూచించారు. 15న బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వెహికిల్, 16న మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్ ఇతర ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు హాజరు కావాలని సూచించారు.

డిగ్రీ ఫలితాలు విడుదల



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న సెమిస్టర్– 2, 4, 6కు సంబంధించి ఫలితాలను పీయూ వీసీ శ్రీనివాస్ సోమవారం విడుదల చేశారు. ఈ మేరకు రెగ్యులర్ పరీక్షలకు సంబంధించి సెమిస్టర్–2 బీఏలో 31.45 శాతం, బీకాంలో 36.86, బీఎస్సీ 29.74 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే సెమిస్టర్–4 బీఏలో 51.36, బీకాంలో 43.57, బీఎస్సీలో 37.63 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. సెమిస్టర్–6 బీఏలో 52.27, బీకాం 54.57, బీఎస్సీ 55.58 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. బ్యాక్‌లాగ్ సెమిస్టర్–5 బీఏలో 52.88 శాతం, బీకాంలో 54.44, బీఎస్సీలో 46.51 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, కంట్రోలర్ ప్రవీణ, శాంతిప్రియ, అనురాధారెడ్డి, అరుంధతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు గ్రహణం

ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల్లో మరమ్మతుల వరంపర



నెట్టెంపాడు ప్రాజెక్టులోని మొదటిలిఫ్టులో మోటార్లలో తరచుగా తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు

- తరుచుగా సాంకేతిక సమస్యలతో నీటి సరఫరాకు ఆటంకం
- ప్రస్తుతం నెట్టెంపాడులో రెండు, కల్వకుర్తి రెండు, కోయిల్‌సాగర్‌లో ఒక పంపుతోనే నీటి పంపింగ్
- బకాయిలు చెల్లిస్తేనే పూర్తిస్థాయిలో మరమ్మతు చేస్తామంటూ ఏజెన్సీల కొర్రీ
- వరద సమయంలోనే హడావుడి చేస్తున్న వైనం

గద్వాల: పాలమూరు బీడు భూములకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా పెద్దఎత్తున సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను నిర్మాణం చేపట్టి వాటి కింద సుమారు 6 లక్షలకు పైగా ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. అయితే.. ఆయా ఎత్తిపోతల పథకాల్లో మోటార్లు తరచుగా మరమ్మతుకు గురవుతుండటంతో నీటి పంపింగ్‌కు అడ్డంకిగా మారుతోంది. పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం కారణంగా ఎత్తిపోతలకు గ్రహణం పట్టినట్లయింది. నీటిని ఎత్తిపోసే పంపులకు సంబంధించి మోటార్లకు గత కొన్నేళ్ల సరైన మరమ్మతు చేయకపోవడం, మెయింటెనెన్స్ డబ్బులు సంబంధిత కంపెనీలకు చెల్లించకపోవడంతో సరైన నిర్వహణకు నోచుకోకపోవడంతో ఎత్తిపోతల ప్రాజెక్టులకు శాపంగా మారింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎత్తిపోతల పరిధిలోని లక్షలాది ఎకరాల ఆయకట్టు రెండో పంటకు సాగునీరు అందించడం ప్రశ్నార్థకంగా మారుతుంది.

ఒక్క మోటారుతో కోయిల్‌సాగర్..

మరికల్, ధన్వాడ, చిన్నచింతకుంట, దేవరకద్ర మండలాల పరిధిలో రెండు పంటలకు 50 వేల ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో కోయిల్‌సాగర్ నిర్మించారు. ఈ ప్రాజెక్టుకు ఆది నుంచి సమస్యలే ఎదురవుతున్నాయి. తాజాగా జూరాల ప్రాజెక్టుకు భారీ వరద వస్తుంది. ఈ క్రమంలో నీటిని ఎత్తిపోయాల్సిన పంపుహౌస్‌లోని రెండు మోటార్లు నిరంతరాయంగా పనిచేస్తే 630 క్యూసెక్కుల చొప్పున 70 రోజులపాటు నడిస్తే 50 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. కానీ, రెండు మోటార్లలో ఒకటి సాంకేతిక సమస్యతో ఏడాదిగా పనిచేయడం లేదు. దీంతో ఒక్క మోటారుతోనే నీటిని ఎత్తిపోస్తున్నారు.

నీటిని పంపింగ్ చేస్తున్నాం..



నెట్టెంపాడు ఎత్తిపోతల స్టేజీ–1, 2లలో మొత్తం 7 మోటార్లు ఉన్నాయి. వీటిలో ఒకసారి మాత్రమే 6 పంపులతో నీటిని పంపింగ్ చేశాం. మోటార్లలో ఎలాంటి సమస్య లేదు. అయితే పంపుహౌస్‌లో గ్రిడ్‌ను రన్ చేసేందుకు ఎస్‌ఎఫ్‌సీ రన్ చేయాల్సి ఉంటుంది. ఒక్కసారి రిపేరు వస్తే సరిచేశాం. ప్రస్తుతం రెండు పంపుల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నాం. దీనిపై బీహెచ్‌ఈఎల్ వారికి తెలియజేశాం. అయితే ఇతర ప్రాజెక్టులలో వారికి రావాల్సిన బిల్లులు బకాయిలు ఉండడంతో రిపేరు చేసేందుకు రావడం లేదు. ఇప్పటి వరకైతే రూ.2 కోట్ల బకాయిలు చెల్లించాం.

– రహీముద్దీన్, ఎస్‌ఈ ఇరిగేషన్ శాఖ

రెండు పంటలకు నీరివ్వాలి..

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం మోటార్లలో సాంకేతిక సమస్యపై ఇరిగేషన్‌శాఖ మంత్రి, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లాను. నీటి పంపింగ్ కోసం అవసరమైన మోటార్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి ఈ వానాకాలంలో లక్ష్యం మేర పంపింగ్ చేసుకుని పూర్తిస్థాయిలో ఆయకట్టు రైతులకు రెండు పంటలకు నీరివ్వాలని కోరాను.

– కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, గద్వాల



కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులోని మొదటి లిఫ్టు వద్ద రిపేరిలో ఉన్న మోటార్లు

రెండు మోటార్లతో నెట్టెంపాడు..



గతేడాది గుడ్డెందొడ్డి లిఫ్టును పరిశీలిస్తున్న అప్పటి సీఈ రఘునాథ్‌రావు, ఎస్‌ఈ శ్రీధర్, ప్రస్తుత ఎస్‌ఈ రహీముద్దీన్ (ఫైల్)

జోగుళాంబ గద్వాల జిల్లావ్యాప్తంగా 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో మొత్తం ఏడు మోటార్లను ఏర్పాటు చేశారు. వీటిలో కేవలం రెండు మోటార్లు మాత్రమే పని చేస్తుండగా.. మిగిలిన ఐదు మోటార్లు మరమ్మతుకు గురయ్యాయి. ఈ మోటార్ల మెయింటెనెన్స్ బీహెచ్‌ఈఎల్ నిర్వహిస్తుండగా.. ప్రభుత్వం నుంచి బకాయిలు రాకపోవడంతో మెయింటెనెన్స్ పనులు ఆపేశారు. గతేడాది ఆగస్టులో సైతం గుడ్డెందొడ్డి లిఫ్టు వద్ద మోటార్లు కాలిపోగా.. నిర్వాహకులు చేతులెత్తేయడంతో అప్పటి సీఈ రఘునాథ్‌రావు ఆధ్వర్యంలో ఇంజినీర్ల బృందం గుడ్డెందొడ్డి లిఫ్టు వద్దకు చేరుకుని మోటార్లలో తలెత్తిన సాంకేతిక సమస్యను బీహెచ్‌ఈఎల్ వారిని ఫోన్ ద్వారా సంప్రదించి మరమ్మతు చేసిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు పరిధిలో 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు గాను ర్యాలంపాడు జలాశయం ద్వారా 1.42 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందిస్తున్నారు.

■ నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన కేఎల్‌ఐ నేటికీ పనులు అసంపూర్తిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు కింద కేవలం 2.50 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోంది. ఈ ప్రాజెక్టులో మొత్తం 5 పంపులు ఏర్పాటు చేయగా.. రెండు పంపులు సాంకేతిక కారణాలతో మూలకు పడ్డాయి. మూడు మోటార్లు ఉన్నా.. రెండింటితోనే నీటి ఎత్తిపోతలు చేపడుతున్నారు.

కమ్యూనిస్టులతోనే సమస్యలు పరిష్కారం



ఉండవెల్లి: కమ్యూనిస్టుల పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయని సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉండవెల్లి మండలం కంచుపాడులోని తన నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో అన్యాయాలు, దోపిడీని అరికట్టేందుకు కమ్యూనిజమే ఏకైక మార్గమన్నారు. కమ్యూనిజానికి మించిన సిద్ధాంతం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందన్నారు. దేశంలోని 80 శాతం హిందువులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం ఓట్ల కోసమే హిందువులను ఏకం చేస్తున్నారన్నారు. పాలకులు మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధానాలను మానుకోవాలని హితవు పలికారు. అనంతరం మండల కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ నాయకురాలు విజయలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఆశన్న, రంగన్న పాల్గొన్నారు.


పక్కా ఫోర్జరీనే..

- పచ్చర్లలో నకిలీ ఓనర్‌షిప్ సర్టిఫికెట్‌పై క్షేత్రస్థాయి విచారణ
- పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసినట్లు తేల్చిన అధికారులు
- ఎస్పీ కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు


రాజోళి: మండలంలోని పచ్చర్ల గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఓ ఇంటిని మరొకరికి విక్రయించిన వైనం నిజమని తేలింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన ఎంపీడీఓ ఖాజామొయినుద్దీన్ నివేదిక సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగా అది పక్కా ఫోర్జరీ అని అధికారులు తేల్చేశారు. పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి.. తమ ఇంటిని ఇతరులకు విక్రయించినట్లు తేలడంతో బాధిత కుటుంబ సభ్యులు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

అసలేం జరిగిందంటే..

రాజోళి మండలం పచ్చర్ల గ్రామానికి చెందిన తామేశ్‌గౌడ్‌కు వారసత్వ ఆస్తిగా ఇంటిని ఇస్తున్నట్టుగా కుటుంబ సభ్యులు ఒప్పందం చేసుకున్నారు. అయితే జీవనోపాధి నిమిత్తం ఆయన తన కుటుంబంతో కలిసి ఇటిక్యాల మండలం ధర్మవరంలో ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఆయనకు దక్కాల్సిన ఇంటిని తన సోదరుడు కుటుంబ సభ్యులతో కలిసి 2025 జనవరి 1న ఇతరులకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసేందుకు గాను గ్రామపంచాయతీ కార్యదర్శి నుంచి తీసుకోవాల్సిన ధ్రువపత్రాల కోసం ఫోర్జరీ సంతకాలకు తెరలేపారు. అందులో భాగంగా 2021లో తమ పేరుపై గ్రామపంచాయతీ కార్యదర్శి ఓనర్‌షిప్ సర్టిఫికెట్ జారీ చేసినట్లు సృష్టించి.. రిజిస్ట్రేషన్ చేయించారు. ఇందుకోసం అవసరమైన సాక్షులను రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తీసుకెళ్లినప్పటికీ.. వారికి విషయం తెలుసుకుండా రిజిస్ట్రేషన్ తతంగం ముగించేశారు. విషయం తెలుసుకున్న బాధితుడు ఫోర్జరీ సంతకాలతో తన ఇంటిని అమ్ముకున్నారని తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో 'సాక్షి' ద్వారా విషయాన్ని బయటకు తీసుకొచ్చారు.



ఉన్నతాధికారులకు రాజోళి ఎంపీడీఓ సమర్పించిన నివేదిక



ఓనర్‌షిప్ సర్టిఫికెట్‌లో తన సంతకం కాదని అప్పటి పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన నివేదిక

కలెక్టర్‌కు నివేదిస్తాం..

పచ్చర్ల గ్రామపంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీకి సంబంధించి ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్ విచారణ అధికారి. ఆయన ఇచ్చిన నివేదికలో ఫోర్జరీ జరిగినట్లు స్పష్టం చేశారు. విచారణ సమయంలో సదరు పంచాయతీ కార్యదర్శిని సైతం విచారించినట్లు నివేదికలో పేర్కొన్నారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు సమర్పించి.. తదుపరి చర్యలు చేపడతాం.

– నాగేంద్రం, ఏడీపీఓ

'సాక్షి' వరుస కథనాలతో కదలిక..

పంచాయతీ కార్యదర్శి ఫోర్జరీ సంతకంపై గత నెల 24న 'ఫోర్జరీ పెట్టు.. ఆస్తి కొట్టు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. అయితే జిల్లాలో ఫోర్జరీ సంతకాలతో మోసపోయిన మరికొందరు బాధితులు 'సాక్షి'ని సంప్రదించడంతో పాటు ఫోర్జరీలకు సంబంధించిన ఆధారాలను సామాజిక మాధ్యమాల ద్వారా బయటపెట్టారు. ఈ నేపథ్యంలో గతనెల 27న 'చర్యలు తీసుకోరా?' శీర్షికతో మరో కథనం ప్రచురితం కావడంతో అధికారులు విచారణ చేపట్టారు. పచ్చర్లలో తప్పుడు ధ్రువపత్రం మంజూరైన సమయంలో ఉన్న పంచాయతీ కార్యదర్శి ధనుంజయరెడ్డిని సైతం విచారించారు. ఆ సమయంలో తాను ఎలాంటి ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు ఇవ్వలేదని.. అందులో ఉన్న సంతకం కూడా తనది కాదని నిర్ధారిస్తూ నివేదిక అందించారు. దీంతో తమ విచారణలో అది తప్పుడు ధ్రువపత్రం అని తేలిందని మండలస్థాయి అధికారులు జిల్లా అధికారులకు నివేదిక సమర్పించారు.

అధునాతన సాంకేతికతతో భూ సర్వేల్లో కచ్చితత్వం



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: లైసెన్స్‌డ్ సర్వేయర్లు అధునాతన సాంకేతికతను క్షేత్రస్థాయిలో అమలు చేసినప్పుడే భూ సర్వేల్లో కచ్చితత్వం ఉంటుందని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. భూ భారతి చట్టం–2025 మేరకు భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ తదితర ప్రక్రియల్లో తప్పనిసరిగా సర్వే చేసి.. మ్యాప్ జత చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గత మే 26న ప్రారంభమైన లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ ప్రస్తుతం కీలక దశలో ఉందన్నారు. కార్యక్రమంలో సర్వే ల్యాండ్ అండ్ రికార్డు ఏడీ రాంచందర్ పాల్గొన్నారు.

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి..

వివిధ సమస్యలపై ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 71 ఫిర్యాదులు అందగా.. పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

■ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, జూనియర్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులకు అనుగుణంగా పరిమితి లోపు ప్రవేశాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పరిమితికి మించి అడ్మిషన్లు ఇవ్వడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. కేజీబీవీల్లో ప్రవేశాలకు సంబంధించి తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



కల్యాణలక్ష్మి పథకం చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి పథకంతో పేదింటి ఆడబిడ్డల పెళ్లికి చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, అలంపూర్, మానవపాడు, వడ్డేపల్లి మండలాలకు చెందిన 94 మంది లబ్ధిదారులకు రూ. 94,10,904 విలువగల చెక్కులను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు మంజుల, జోషి శ్రీనివాస శర్మ, భద్రప్ప, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, కరుణసింహారెడ్డి, శ్రీనివాసులు, రవి, మురళీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

స్వాతంత్రోద్యమంలో మైనార్టీల పాత్ర మరవలేనిది



మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్

గద్వాలటౌన్: దేశ స్వాతంత్రోద్యమం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ముస్లిం మైనార్టీల పాత్ర మరవలేనిదని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఆవాజ్ రాష్ట్ర మహాసభల్లో భాగంగా రెండో రోజు సోమవారం 'భారత స్వాతంత్ర్య ఉద్యమం– మైనార్టీల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముస్లిం మైనార్టీలు ఎంతో మంది బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు చారిత్రక పోరాటాలకు మతంరంగు పులిమితే దేశ ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆకలి, పేదరికం, నిరుద్యోగం పెరిగిందని ఆందోళన వ్యక్తంచేశారు. తమ ఆర్థిక రాజకీయ దోపిడీని కప్పిపుచ్చుకోవడానికి విద్వేష రాజకీయాలకు ఆజ్యం పోస్తుందని ధ్వజమెత్తారు. ప్రజలు జాగ్రుతమై సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మైనార్టీ హక్కుల పరిరక్షణ కోసం తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అతికూర్ రెహమాన్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, వెంకటస్వామి, ఆంజనేయులు, ఇక్బాల్‌పాషా, పల్లయ్య, జలీల్, తాహేర్, రంగు మద్దిలేటి, ఆంజనేయులు, సునందం, వీవీ నర్సింహ, రహీమతుల్లా, ఉప్పేర్ నర్సింహ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో వసతుల కల్పనకు నిధులు



ధరూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

నిధుల మంజూరు ఇలా..

కళాశాల	నిధులు (రూ.లలో)
గద్వాల	12.5 లక్షలు
ధరూర్	11.5 లక్షలు
అలంపూర్	11.5 లక్షలు
గట్టు	10.1 లక్షలు
మానవపాడు	15 లక్షలు
మల్దకల్	15 లక్షలు
అయిజ	14.5 లక్షలు

గద్వాలటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల బలోపేతానికి సర్కారు చర్యలు చేపట్టింది. విద్యార్థులకు మౌలిక వసతులతో పాటు భవనాల మరమ్మతు, బోధనకు వీలుగా సౌకర్యాల కల్పనకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా కళాశాలల్లో గుర్తించిన అవసరాలను తీర్చేందుకు నిధులు మంజూరు చూసింది. జిల్లాలో మొత్తం ఎనిమిది జూనియర్ కళాశాలలు ఉండగా.. ఏడు కళాశాలలకు రూ. 90.1 లక్షలు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు వచ్చాయి. ఈ నిధులతో కళాశాల భవనాలకు రంగులు వేయడం, విద్యుత్ మరమ్మతు, నీటి సౌకర్యం, గ్రీన్ బోర్డు తదితర మౌలిక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని.. కలెక్టర్ ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామని డీఐఈఓ హృదయరాజు తెలిపారు.

18న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన



పెంట్లవెల్లి: నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ నెల 18వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పెంట్లవెల్లి మండలం జటప్రోల్ గ్రామంలో 22 ఎకరాలలో నిర్మించనున్న రెసిడెన్షియల్ స్కూల్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం అక్కడే బహిరంగసభ నిర్వహించనున్నారు. కాగా.. సోమవారం నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ హెలీప్యాడ్, సభావేదిక, పార్కింగ్ వంటి స్థలాలను పరిశీలించి.. అధికారులతో సమీక్షించారు. సమయం లేనందున అధికారులు క్షేత్రస్థాయిలో దగ్గరుండి మూడు రోజుల్లో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అసంపూర్తి పనులు మరింత ముమ్మరం చేయాలని జిల్లాస్థాయి అధికారులకు సూచించారు. మంగళవారం మంత్రి జూపల్లి కృష్ణారావు స్థల పరిశీలన చేస్తారని, ఆలోగా పనులు కొలిక్కి వచ్చేలా చూడాలన్నారు. సభావేదిక ఏర్పాట్లు, ఇతర పనుల్లో ఎలాంటి అలసత్వం వహించరాదని చెప్పారు.

క్లుప్తంగా

నదిలో పడి వివాహిత మృతి

ఎర్రవల్లి: కృష్ణానదిలో పడి ఓ వివాహిత మృతిచెందిన ఘటన ఇటిక్యాల ఠాణా పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేష్ కథనం మేరకు.. మహబూబ్‌నగర్‌కు చెందిన గుబ్బా చంద్రకళ (50) దైవ దర్శనానికిగాను ఆదివారం బీచుపల్లికి వెళ్లింది. సోమవారం ఉదయం పుష్కరఘాట్ వద్ద కృష్ణానదిలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి నీటి పంపునకు తగిలి అక్కడే నిలిచింది. జాలర్లు గుర్తించి ఒడ్డుకు చేర్చి చూడగా ఆమె అప్పటికే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల మార్చురీకి తరలించి భర్త గోపాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



అలంపూర్: క్యాతూర్‌లో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా.. అలంపూర్ మండలంలోని క్యాతూర్ గ్రామ శివారులో ఆర్డీఎస్ పిల్ల కాలువలో సోమవారం గుర్తు తెలియని మృతదేహం గుర్తించినట్లు తెలిపారు. మృతుడి వయస్సు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 70285కు ఫోన్ చేయాలని ఎస్‌ఐ కోరారు.

కేజీబీవీలో సీట్లిప్పిస్తామని మోసం : వ్యక్తిపై కేసు

ఉండవెల్లి: ఇప్పటి వరకు ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసే వారిని, ఆన్‌లైన్ మోసాలను చూశాం. కానీ, కొత్తగా కేజీబీవీలో సీట్లిప్పిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులతో డబ్బులు, సర్టిఫికెట్లు తీసుకుని మోసం చేసిన ఘటన ఉండవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. మండలంలోని కలుగోట్ల శివారులో ఉన్న కేజీబీవీకి గద్వాల మండలంలోని తెలుగోనిపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు బాలికల అడ్మిషన్ కోసం తల్లిదండ్రులతో కలిసి వచ్చారు. ఆ తర్వాత గత నెల 20న కేజీబీవీకి అలంపూర్ మండలానికి చెందిన దివాకర్ వచ్చి తల్లిదండ్రులను పరిచయం చేసుకుని ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలించి తాను అడ్మిషన్ ఇప్పిస్తానని, ఇందుకోసం ఖర్చవుతుందని చెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అంగీకరించారు. ఈ మేరకు తెలుగు పరశురాముడు రూ.18 వేలు, రాముడు రూ.13 వేలు కలిపి మొత్తం రూ.31 వేలు దివాకర్‌కు అందజేశారు. సీట్లు వచ్చాక ఫోన్ చేస్తామని ఆ రోజు రావాలని చెప్పి పంపారు. తర్వాత కొన్ని రోజులపాటు బాధితులు ఫోన్ చేయగా.. స్పందించకపోవడంతో మోసపోయామని గుర్తించి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. సోమవారం తెలుగు పరశురాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

వక్ఫ్ భూమి విక్రయించిన ముగ్గురిపై కేసు నమోదు

గద్వాల క్రైం: వక్ఫ్ భూమికి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి మహిళకు విక్రయించి మోసం చేసిన ఘటనలో ముగ్గురు వ్యక్తులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. వివరాలిలా.. పట్టణానికి చెందిన ఓ మహిళకు రాఘవేంద్ర (ధరూర్‌మెట్) కాలనీ శివారులో వక్ఫ్ భూమికి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి రూ.3 లక్షలకు విక్రయించారు. అయితే సదరు మహిళ కొనుగోలు చేసిన క్రమంలో తప్పుడు ధ్రువపత్రాలతో భూమిని విక్రయించినట్లు గుర్తించింది. ఈ స్థలానికి మున్సిపల్ కార్యాలయంలో ఇంటి నంబర్ సైతం లేకపోవడంతో మోసపోయినట్లు సోమవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మహ్మద్‌నసీబ్, మహ్మద్‌యాకుబ్, కుర్వ శ్రీనివాసులుపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'పీఎం కిసాన్ ఫైల్'తో రూ.లక్ష మాయం

జడ్చర్ల: వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన పీఎం కిసాన్ ఏపీకే ఫైల్‌ను ఓపెన్ చేసిన వెంటనే తన బ్యాంకు ఖాతా నుంచి రూ.లక్ష మాయం అయినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన సోమవారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కమలాకర్ కథనం మేరకు.. స్థానిక బాలాజీనగర్‌కు చెందిన ఎండీ అంజూమ్ ఆలీకి ఈనెల 7న వాట్సాప్ గ్రూప్‌లో పీఎం కిసాన్ యోజన ఏపీకే ఫైల్ వచ్చింది. ఆ ఫైల్‌ను క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసిన తర్వాత తన గూగుల్ పే నుంచి రూ.50 వేల చొప్పున రెండు సార్లు బ్యాంకు ఖాతా నుంచి డ్రా అయినట్లు గుర్తించాడు. వెంటనే సైబర్ క్రైంకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

110 లీటర్ల కల్లు స్వాధీనం

గద్వాల క్రైం: ప్రభుత్వ అనుమతి లేకుండా కల్లు విక్రయిస్తున్న నలుగురుపై కేసులు నమోదు చేసినట్లు గద్వాల ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి తెలిపారు. పట్టణ శివారులో ప్రభుత్వ అనుమతి లేకుండా కృష్ణ, వెంకట్రాములు, వెంకటేష్, పద్మ గుట్టుగా కల్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఎస్‌టీఎఫ్, డీటీఎఫ్, గద్వాల ఎక్సైజ్ సిబ్బంది మూడు బృందాలుగా విడిపోయి తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ క్రమంలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 110 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో శ్రీకాంత్‌రెడ్డి, వీరేషలింగం పాల్గొన్నారు.

ఉన్నతస్థాయి శిక్షణకు వేదిక

మెయిన్ స్టేడియంలోని వాలీబాల్ అకాడమీ



వాలీబాల్ అకాడమీ కోర్టులు

- 15 మంది బాలురు, 17 మంది బాలికల ఎంపిక
- ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ
- రూ.19.70లక్షలతో వసతుల ఏర్పాటు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర క్రీడా సాధికారిక సంస్థ 2004లో జిల్లాకు వాలీబాల్ అకాడమీ మంజూరు చేయగా నాలుగేళ్లలో జిల్లా క్రీడాకారులు అనేక మంది శిక్షణ పొందారు. నిధుల నిర్వహణ భారంతో 2008 సంవత్సరంలో వాలీబాల్ అకాడమీని మూసేశారు. వాలీబాల్ అకాడమీలో శిక్షణ పొందిన జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారులుగా రాణించారు. మెయిన్ స్టేడియంలో వాలీబాల్ అకాడమీని తిరిగి ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉండగా.. మూడేళ్ల క్రితం తిరిగి పునఃప్రారంభించారు. రూ.19.70లక్షలతో వాలీబాల్ అకాడమీ ఏర్పాటు చేశారు. స్టేడియం ఆవరణలోగల స్విమ్మింగ్‌పూల్‌లోని అంతస్తుల గదులకు మరమ్మతు పనులు చేపట్టారు. రెండు పాత వాలీబాల్ కోర్టులను ఆధునీకరించి వాటి స్థానంలో నూతన కోర్టులు ఏర్పాటు చేశారు. క్రీడాకారుల వసతి సామగ్రి ఇప్పటికే అకాడమీకి చేరాయి. స్విమ్మింగ్‌పూల్ అంతస్తులో బాలురకు, ఇండోర్ స్టేడియంలో బాలికలకు వసతి ఏర్పాటు చేశారు.

మెరుగైన శిక్షణ

వాలీబాల్ అకాడమీలో ఎంపికైన బాల, బాలికలకు ఇద్దరు లేదా ముగ్గురు కోచ్‌ల పర్యవేక్షణలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. దాదాపు రెండు నెలలపాటు వాలీబాల్ బేసిక్ శిక్షణ ఇచ్చి, వారిలో అటాకర్, షూటర్, బ్లాకర్, లిబిరో స్థానాల్లో ఆడేవారిని గుర్తిస్తారు. అకాడమీలో శిక్షణ పొందే క్రీడాకారులను రాష్ట్ర, జాతీయస్థాయి టోర్నీల్లో ఆడేలా తీర్చిదిద్దుతారు.

ఎంపికైన క్రీడాకారులు

బాలురు.. బోయ చందు (జోగులాంబ గద్వాల), జి.వరుణ్‌కుమార్ (రంగారెడ్డి), రాత్లావత్ రఘువీర్ (నాగర్‌కర్నూల్), చెన్నదీక్షిత్ (మహబూబ్‌నగర్), గోగురి వరుణ్‌సాయి (జగిత్యాల), పి.ప్రశాంత్ (మహబూబ్‌నగర్), వి.మదన్‌రాజ్‌గౌడ్ (వనపర్తి), ఆత్రం శంకర్ (ఆదిలాబాద్), దులకడి నరేష్ (వికారాబాద్), సున్‌కసరి జ్ఞానేశ్వర్ (మహబూబ్‌నగర్), ఎస్.గణేష్ (రంగారెడ్డి), మహ్మద్ ముఖీద్ (షాద్‌నగర్), డి.కుషల్‌కుమార్, సత్తు అరుణ్‌కుమార్ (రంగారెడ్డి), జశ్వంత్ (సిద్దిపేట)

బాలికలు.. సీహెచ్ శరణ్య, ఎన్ శ్రీలేఖ, టి ప్రియాంక, డి కావ్య (వనపర్తి), వి సాయికీర్తన (రంగారెడ్డి), ఎం సమత (నారాయణపేట), సబావత్ స్వాతి, బి అమృత, టి బిందు మాధవి (వనపర్తి), జొరాల హరిక, ఎ.స్వాతి (మహబూబ్‌నగర్), టినిటి వైష్ణవి (నారాయణపేట), గుంటి మైత్రి (నాగర్‌కర్నూల్), బి.శిరీష (వనపర్తి), ఆర్.దివ్య (మహబూబ్‌నగర్), బైకని స్పందన (వికారాబాద్), కె.మౌనిక (మహబూబ్‌నగర్)

అకాడమీలో క్రీడాకారుల ప్రవేశాలు

వాలీబాల్ అకాడమీలో ప్రవేశాల కోసం 2022 డిసెంబర్ 1న రాష్ట్రంలోని బాల, బాలికలకు ఎంపికలు నిర్వహించినా అప్పట్లో క్రీడాకారుల ప్రవేశాలు మాత్రం కల్పించలేదు. మళ్లీ జూన్ 12న వాలీబాల్ అకాడమీలో ప్రవేశాల కోసం ఎంపికలు నిర్వహించగా రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుంచి బాల, బాలికలు హాజరయ్యారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌లో ఎంపికైన క్రీడాకారుల వివరాలను సోమవారం జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ ప్రకటించారు. క్రీడాకారులు మంగళవారం సాయంత్రం 5 గంటలకు మెయిన్ స్టేడియంలో రిపోర్టు చేయాలని, మిగతా వివరాల కోసం వాలీబాల్ కోచ్ పర్వేజ్‌పాష 77805 82604 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



క్రీడాకారుల వసతి సామగ్రి

తేజేశ్వర్ హత్యలో ట్విస్టుల మీద ట్విస్టులు



తిరుమలరావు నుంచి సేకరించిన వాయిస్ మెసేంజర్ పరికారం

గద్వాల క్రైం: జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రానికి చెందిన ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ దారుణ హత్య కేసులో ట్విస్టుల మీద ట్విస్టులు బయటపడుతున్నాయి. హత్యకు పాల్పడిన ప్రధాన నిందితులు తిరుమలరావు ఏ–1, కుమ్మరి నాగేష్ ఏ–3, చాకలి పరశురాముడు ఏ–4, చాకలి రాజు ఏ–5లను ఈ నెల 10న విచారణ అధికారి శ్రీను కోర్టు అనుమతితో నిందితులను మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని హత్యకు దారి తీసిన అంశాలను నిందితుల నుంచి వివరాలు సేకరించారు. ఈ క్రమంలో మొదటి రోజు హత్య, రెండోరోజు బ్యాంకు తనిఖీలో వాయిస్ మెసేంజర్, మూడోరోజు గద్వాలలో మృతుడి బెడ్‌రూంలో స్పై కెమెరా ఉన్నట్లు నిందితులు వాంగ్మూలం ఇచ్చారు.

- మూడు రోజుల పోలీసుల కస్టడీలో నిందితులు చెప్పిన వాంగ్మూలం, సీన్ రీ కన్‌స్ట్రక్షన్‌లో హత్యకు గల కారణాలు వెల్లడించారు. అయితే తేజేశ్వర్ ఉంటున్న బెడ్‌రూంలో స్పై కెమెరా ఉన్నట్లు బహిర్గతం చేయడంతో పోలీసులు సైతం కంగుతిన్నారు. అనుకున్న ప్రకారం నెల వ్యవధిలో తేజేశ్వర్‌ను హత్య చేయాలనే లక్ష్యంతో పథకం వేసినట్లు చెప్పారు. హత్య చేసి కొన్ని రోజులు లడాఖ్ లేదా అండమాన్‌లో స్థిరపడాలనే ప్రణాళిక రచించినట్లు ధ్రువీకరించారు. ఈ కొత్త ట్విస్టు వెలుగులోకి రావడంతో ఐశ్వర్యను కస్టడీలోకి తీసుకునేందుకు పోలీసులు పీటీ వారెంట్‌ను కోర్టుకు సమర్పించారు. శనివారం రాత్రి కస్టడీలోకి తీసుకున్న నిందితులను విచారణ అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అయితే నేడో, రేపో ఏ–2 ఐశ్వర్యను కస్టడీలోకి పోలీసులు తీసుకునే అవకాశం ఉంది.

మరోసారి కస్టడీ తీసుకుంటాం..



తేజేశ్వర్ హత్యకు గల కారణాలు, తిరుమలరావు, ఐశ్వర్యలు సుపారీ గ్యాంగ్‌తో వేసిన పథకం తదితర అంశాలపై ఏ–1, 3, 4, 5లను కస్టడీలోకి తీసుకుని విచారించాం. అయితే స్పై కెమెరా విషయంపై స్పష్టత లేదు. దీనిపై ఏ–2 ఐశ్వర్యను కస్టడీలోకి తీసుకుంటే పూర్తి వివరాలు వెలుగులోకి వస్తాయి. సాంకేతిక పరిజ్ఞానం, హత్యకు వేసిన ప్రణాళికలు నిందితుల వాంగ్మూలం, సీన్ రీ కన్‌స్ట్రక్షన్ పూర్తి చేశాం. త్వరలో అన్ని వివరాలు తెలియజేస్తాం. – శ్రీను, సీఐ, గద్వాల

బలవంతపు భూసేకరణ సరికాదు



మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

నారాయణపేట టౌన్: నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా బలవంతపు భూ సేకరణ సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లా కేంద్రంలోని స్థానిక మున్సిపల్ పార్క్ వద్ద రైతులు చేసిన ధర్నాకు మద్దతు ప్రకటించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీపూర్, బాపూర్, ఊట్కూర్ ప్రాంతంలోని కొందరు రైతులకు భూ పరిహారం కింద ఎకరాకు రూ.14 లక్షలు మంజూరు చేసి, ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. బహిరంగ మార్కెట్ విలువ ఆధారంగా భూముల బేసిక్ ధరను నిర్ణయించడానికి ప్రత్యేక కమీషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

612 కిలోల నల్లబెల్లం పట్టివేత

అచ్చంపేట రూరల్: అక్రమంగా నల్లబెల్లం సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం పట్టణ శివారులో ఎక్సైజ్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మహీంద్రా జైలో వాహనంలో నల్లబెల్లాన్ని గుర్తించామన్నారు. దీంతో అచ్చంపేట పట్టణానికి చెందిన పోల కుసుమశెట్టిని అదుపులోకి తీసుకుని వాహనంలో ఉన్న 612 కిలోల నల్లబెల్లం, 25 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని అచ్చంపేట తహసీల్దార్ ఎదుట రూ.5లక్షలకు బైండోవర్ చేశామని తెలిపారు. అక్రమంగా నల్లబెల్లం సరఫరా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



స్వాధీనం చేసుకున్న వాహనం, నల్లబెల్లం చూయిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

భాస్వరం.. పొటాషియం కీలకం



మొక్కజొన్న పంట (ఫైల్)



పొటాష్ లోపించిన మొక్క

పాడి-పంట

జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్: మొక్క పెరుగుదలలో నత్రజని, భాస్వరం, పొటాషియంల పాత్ర ముఖ్యమైంది. పంటల పెరుగుదలలో భాస్వరం, పొటాషియం పాత్రల ప్రాముఖ్యతను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియానాయక్ రైతులకు వివరించారు.

భాస్వరం: ఈ పోషకాన్ని మొక్కలు భాస్వరికామ్ల లవణాల రూపంలో తీసుకుంటాయి. భాస్వరానికి నేలలో కొట్టుకపోయే స్వభావం లేదు. అయితే కొంత భాగం నేలలో బిగుసుకుపోతుంది. మట్టి రేణువులకు అంటిపెట్టుకొని తర్వాత పైరుకు కూడా ఉపయోగపడుతుంది. పైరుకు ప్రథమ దశలో భాస్వరం అవశ్యకత అధికం కావున పూర్తి మోతాదు మొదటనే పైరు అడుగులో ఒకేసారి వేయాలి. దానిని నేలలో కలిసేటట్టు చేయాలి.

పంటల పెరుగుదలలో భాస్వరం పాత్ర

- పూత, కాత గింజ పట్టడానికి
- పైరు దుబ్బు చేయుటకు, మొక్క శాఖోప శాఖలుగా పెరిగేందుకు
- సేంద్రియ పదార్థాలు బాగా చివుటకు
- మొక్కల్లో మాంసకృత్తులు, ఎంజైముల తయారీకి
- భాస్వరం, నత్రజని తగినంత మోతాదులో ఉన్నప్పుడు రెండింటిని మొక్క అత్యంత సమర్థవంతంగా ఉపయోగించుకోవడంలో ఒకదానికి ఒకటి తోడ్పడతాయి.

భాస్వరం లోపిస్తే..!

- మొక్క పెరుగుదల, పిలకలు పెట్టె శక్తి తగ్గుతుంది.
- వేరు వ్యవస్థ బలహీనంగా ఉంటుంది.
- ఆకులు ముదురు ఆకుపచ్చ, నీటి రంగు కలిసినట్లుగా ఉంటాయి.
- పూత రావడం, పైరు పక్వానికి రావడం ఆలస్యం అవుతుంది.

పొటాషియం: ఈ పోషకాన్ని మొక్క పొటాషియం రూపంలో తీసుకుంటుంది.

ప్రాధాన్యత ఇలా..

- పైరుకు ఆరోగ్యం, ధృడత్వం చేకూరుతుంది.
- మొక్కల్లో జరిగే జీవ రసాయన క్రియలకు, ఆకుల్లో తయారైన పిండి పదార్థం ఇతర భాగాలకు చేరేందుకు..
- పైరుకు రోగ నిరోధకశక్తిని కలిగించి పురుగులకు, తెగుళ్ల నుంచి కాపాడుతుంది.
- శాఖీయ భాగాలను, కాండాన్ని బలపరిచి నేలపై వాలనీయదు.
- గింజ కట్టు పూర్తిగా ఉండి నాణ్యత పెరుగుతుంది.
- ప్రత్యేకించి పండ్లు కూరగాయాలు మొదలగు పంటల్లో నాణ్యత పెరగడానికి దోహదపడుతుంది.
- చలి వాతవరణం లాంటి ప్రతికూల పరిస్థితులను తట్టుకోవడానికి ఉపయోగపడుతుంది.

పొటాషియం లోపిస్తే..

- ముదురు ఆకుల అంచులు ఆకు పచ్చ రంగు నుంచి పసుపు రంగులోకి మారతాయి.
- ఆకు కొనలు గోధుమ రంగులోకి మారి దిగువ భాగానికి విస్తరిస్తుంది.
- పెరుగుదల నెమ్మదిగా ఉండి మొక్క గిడసబారుతుంది.
- కాండం బలంగా లేక సులభంగా వాలిపోతుంది.
- పండ్లు కూరగాయాల్లో రంగు, రుచి, వాసన, రవాణాలో నిల్వ ఉండే గుణం తగ్గుతుంది.

తప్పుడు రిపోర్టు ఇచ్చిన డయాగ్నోస్టిక్ సెంటర్‌పై చర్యలు


సాక్షి ఎఫెక్ట్..

అయిజ: గర్భిణికి తప్పుడు రిపోర్టు ఇచ్చిన డయాగ్నోస్టిక్ సెంటర్‌పై చర్యలు తీసుకుంటామని జోగుళాంబ గద్వాల ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ సిద్దప్ప తెలిపారు. ఈ ఘటనపై 'సాక్షి'లో 'గర్భిణికి తప్పుడు రిపోర్టు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో స్పందించిన ఆయన సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ 'సాక్షి'తో మాట్లాడుతూ గర్భిణికి తప్పుడు రిపోర్టు ఇచ్చిన ఘటనపై చర్యలు తీసుకునేందుకు కమిటీ వేసి పూర్తిస్థాయిలో విచారణ చేస్తామన్నారు. గర్భిణికి గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేయాలని సూపరింటెండెంట్ ఇందిరకు సూచించారు. ఇదిలా ఉండగా.. గర్భిణికి తప్పుడు రిపోర్ట్ ఇచ్చిన డయాగ్నోస్టిక్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్ న్యూడెమోక్రసీ) నాయకులు సోమవారం ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ సిద్దప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, హలీం పాష, హరీష్, దానయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జూరాల క్రస్ట్ గేట్ల మూసివేత



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గడంతో సోమవారం క్రస్ట్ గేట్లు మూసినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 30 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. జల విద్యుదుత్పత్తి నిమిత్తం 10 వేల క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్ట్–1కు 1,300, ఆవిరి రూపంలో 44, ఎడమ కాల్వకు 1,250, కుడి కాల్వకు 470, ఆర్డీఎస్ లింక్ కాల్వకు 150, భీమా లిఫ్ట్–2కు 750, సమాంతర కాల్వకు 1,150 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.790 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

విద్యుదుత్పత్తి నిలిపివేత..

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు ఆశించిన స్థాయిలో వరద చేరకపోవడంతో దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలిపివేసినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం వరకు విద్యుదుత్పత్తి చేపట్టామని.. ఎగువ 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 119.406 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 141.208 మి.యూ. ఉత్పత్తి చేపట్టినట్లు వివరించారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో ఇప్పటి వరకు 261.208 మి.యూ. విద్యుదుత్పత్తి జరిగిందన్నారు.

సుంకేసులకు 30 వేల క్యూసెక్కుల వరద..

రాజోళి: సుంకేసుల జలాశయానికి ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి సోమవారం వరద కొనసాగింది. 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 8 గేట్లు తెరిచి 31,928 క్యూసెక్కుల నీటిని దిగువకు, కేసీ కెనాల్‌కు 760 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర పేర్కొన్నారు.

శ్రీశైలంలో 882.8 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885.0 అడుగులు, 215.8070 టీఎంసీలు కాగా, సోమవారం 882.8 అడుగుల నీటిమట్టం వద్ద 203.4290 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 31,928 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరగా.. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 33,024 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు వదిలారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 20 వేల క్యూసెక్కులు, ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.901 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 17.889 మి.యూ. విద్యుదుత్పత్తి జరిగింది.

ప్రైవేటు స్కూల్ బస్సు బ్రేకులు ఫెయిల్

అయిజ: పట్టణంలోని నవభారత్ స్కూల్‌కు చెందిన బస్సు బ్రేకులు ఫెయిలై ద్విచక్ర వాహనాల పైకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాలు.. సోమవారం పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో రాంగ్ రూట్‌లో వెళ్తున్న నవభారత్ స్కూల్ బస్సు మరో స్కూల్ బస్సును ఢీకొనే క్రమంలో బస్సును రోడ్డు పక్కకు మళ్లించాడు. ఈ క్రమంలో బస్సు బైక్ పైకి దూసుకెళ్లింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి చాకచక్యంగా బైక్ పైనుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. ఫిట్‌నెస్ లేని బస్సులు అతివేగంగా వెళ్లడం, రాంగ్ రూట్‌లో బస్సులు నడపడంతో పట్టణంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పట్టణ ప్రజలు వాపోతున్నారు.



బస్సు ఢీకొనడంతో కిందపడిన బైకులు

భారీ మనుగుమియ్యా చేప లభ్యం

కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడికి భారీ మనుగుమియ్యా చేప లభ్యమైంది. ఎర్రవల్లి మండలంలోని షేకుపల్లికి చెందిన తెలుగు బుచ్చన్న సోమవారం గ్రామ శివారులోని కృష్ణానదిలో చేపల వేట కోసం వెళ్లి గాలాలు వేయగా 5 కిలోల బరువున్న మనుగుమియ్యా చేప చిక్కింది. సాధారణంగా ఈ చేపలు అర కిలో నుంచి కిలో లోపే బరువు ఉంటాయి. కానీ 5 కిలోల చేప లభ్యం కావడంతో గ్రామస్తులు కొనుగోలు చేసేందుకు పోటీ పడి రూ.2,500 కొన్నారు. ఈ చేప అచ్చం పాములా ఉంది.. అధిక పోషకాలు, రుచికరమైన మాంసం కలిగి ఉంటుందని పేర్కొన్నారు. – ఎర్రవల్లి



'రాష్ట్ర సరిహద్దు పన్ను రద్దు చేయాలి'



సభ్యత్వ నమోదులో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి తదితరులు

జడ్చర్ల: తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలకు టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సులు వెళ్లే క్రమంలో వసూలు చేస్తున్న పన్నులను రద్దు చేయాలని టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సు యజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జడ్చర్లలో ట్రావెల్స్ బస్సు యజమానుల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో కర్ణాటక మినహాయించి కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలకు వెళ్లే ట్రావెల్స్ బస్సులకు ఎలాంటి పన్ను విధానం లేదన్నారు. ఇతర రాష్ట్రాలతో కుదిరిన అవగాహన ఒప్పందంతో పన్నులు ఉండేవి కావన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం ఆయా విధానానికి స్వస్తి పలకడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లే సందర్భంగా సరిహద్దు పన్నులు చెల్లించాల్సి వస్తుందని వాపోయారు. అదేవిధంగా తమ బస్సులకు పట్టణాల్లో పార్కింగ్ చలాన్లు విధిస్తున్నారని వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇక గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గించాలని కోరారు. తమ సమస్యల పరిష్కారానికి త్వరలోనే రాష్ట్ర స్థాయిలో టూరిస్ట్ బస్సు యజమానుల సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. జడ్చర్లలో 60 మంది సభ్యత్వం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి హరీశ్, జిల్లా నాయకులు కమతం వెంకటేశ్వర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మహేశ్, సంతోష్, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.